క్లుప్తంగా

నంద్యాలలో కార్డెన్ సెర్చ్



సీజ్ చేసిన వాహనాల వద్ద పోలీసులు

బొమ్మలసత్రం: పట్టణంలోని విశ్వనగర్ కాలనీలో ఆదివారం వేకువజామున సీఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 13 వాహనాలను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను అదుపు చేసేందుకు ముందస్తుగా అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టామన్నారు. సరైన పత్రాలు లేని 13 బైక్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రహదారి శిలాఫలకం ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

ఆళ్లగడ్డ: పట్టణంలోని ఏసునాథపురం నుంచి రెహబోతు ప్రార్థనా మందిరానికి అనేక ఏళ్లుగా రహదారి సౌకర్యం లేకపోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించింది. ఈ ఏడాది మార్చిలో అప్పటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఈ రోడ్డును ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దీన్ని గుర్తించారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నంద్యాల(న్యూటౌన్) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యూటీఎఫ్ పని చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శులు రామమోహన్, రామకృష్ణుడు, అరవిందు, రామదాసు, గోపాల్ పాల్గొన్నారు.

బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల(న్యూటౌన్) : వేసవి సెలవుల్లో నిర్వహించే బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కార్యదర్శి శివయ్య కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మే 31న కటాఫ్ తేదీ తీసుకోవడం వల్ల 2023 జూన్ నెలలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయలకు అవకాశం ఉండదని, దీని వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఖాళీగా ఉన్న స్థానాలను దృష్టిలో ఉంచుకొని సీనియర్లకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, రంగనాయకులు, తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మిడుతూరు : నందికోట్కూరు– నంద్యాల రహదారిలోని విపనగండ్ల బాట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు నందికోట్కూరు పట్టనానికి చెందిన యువకుడు గోపీనాథ్ ద్విచక్ర వాహనంపై మిడుతూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వీపనగండ్ల బాట సమీపంలోని గోడౌన్ వద్ద మోటార్ బైకు అదుపు తప్పడంతో కింద పడ్డాడు. నందికోట్కూరు పట్టణం నుంచి వస్తున్న ఎస్ ఓబులేసు ప్రమాదం జరిగిన ఘటన చూసి 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

లారీ క్లీనర్‌పై దాడి

కొలిమిగుండ్ల: ట్రాక్టర్లు, లారీల్లో నాపరాళ్ల రవాణ జరగకుండా చెక్‌పోస్టు వద్ద యజమానులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి అవుకు మండలం రామాపురం నుంచి పాలీష్ లోడ్‌తో లారీ వెళ్లగా చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. మాటామాట పెరిగి లారీ క్లీనర్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఈవిషయంపై అవుకు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. సంబంధిత లారీని అడ్డుకోవడంతో అక్కడే నిలిపివేశారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వలసజీవుల బతుకు బాట

- గుంటూరు, నరసరావుపేట, అద్దంకి, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు ప్రాంతాల నుంచి రాక
- సీజన్‌లో ఏటా 6 నెలల పాటు ఇక్కడే సంచార జీవితం
- వ్యవసాయ అవసరాల కోసం ప్లాస్టిక్ పట్టాల వ్యాపారం
- దాదాపు 2 వేల కుటుంబాలకు ఉపాధి
- ఆరు బయటే జీవనం



రైతునగరం వద్ద పట్టాలను సరిచేసుకుంటున్న దృశ్యం



చాబోలులో బాడుగకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ప్లాస్టిక్ పట్టాలు

గోస్పాడు: పని చేస్తే తప్ప పిడికెడు ముద్ద దొరకని పరిస్థితిలో ఇతర ప్రాంతాల నుంచి కొందరు కుటుంబాలతో వలస వస్తున్నారు. స్థానికంగా సక్రమంగా పనులు దొరకక అవస్థలు పడుతూ వందల కిలో మీటర్ల కొద్ది వలస వచ్చి కష్టాన్ని నమ్ముకొని పని చేస్తున్నారు. వ్యవసాయానికి అనుసంధానంగా ఉంటూ పైర్ల కోతల సమయంలో ప్లాస్టిక్ పట్టలను బాడుగలకు ఇస్తూ కుటుంబాన్ని పోషించుకోవడం కోసం రాష్ట్రంలోని గుంటూరు, నరసరావుపేట, అద్దంకి, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి పలువురు వలస వస్తున్నారు. వచ్చి చేతివృత్తిపై ఆధారపడి పనులు చేస్తూ కాలం గడుపుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో వరిపైరు 66,364 హెక్టార్లలో సాగుకాగా ప్రస్తుతం నూర్పిళ్లు జరగుతున్నాయి. వీటితోపాటు తుపాన్ ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు పట్టల వినియోగం కొంతమేరకు పెరిగింది. దీంతో వలస కుటుంబాల వారికి పట్టల బాడుగ వ్యాపారం ఈ సీజన్‌లో కొంత ఆశాజనకంగా ఉందని చెబుతున్నారు.

తప్పని ఆగచాట్లు..

ఎండనకా, గాలనకా ఎక్కడ పడితే అక్కడ తమ పనులు చేసేందుకు కాసింత అనువైన స్థలం చూసుకొని వలస కుటుంబాలు, కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. అసలే చలికాలం కావడంతో ఒళ్లు గగుర్పొడిచేలా చలి ఉన్నా వారుమాత్రం రైతులకు ఇచ్చే ప్లాస్టిక్ పట్టాలను చిన్నపాటి గుడారులుగా వేసుకొని తమ కార్యకలాపాల్ని సాగిస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే సమయంలో తుపాన్ ప్రభావంతో వర్షాలు పడుతున్నా తప్పని పరిస్థితి. ఏటా ఇక్కడి ప్రాంతాలకు వచ్చి సీజన్‌లో రైతులకు అవసరమైన పట్టాలను బాడుగలకు ఇస్తూ ఆరు నెలల పాటు గ్రామాల్లో తిరుగుతూ జీనం సాగిస్తారు. అనాది నుంచి రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగించడమే తమకు తెలిసిన పని వారు చెబుతున్నారు.

రెండువేల కుటుంబాలకు పైగా వలస..

ఏటా వివిధ జిల్లాల నుంచి దాదాపు 2వేలకు పైగా నిరుపేద కుటుంబాలు నంద్యాల జిల్లాలోని మండలాల పరిధిలోని గ్రామాలన్నింటిలో ఒకరిద్దరు మొదలు గ్రామస్థాయిని బట్టి అంతకంటే ఎక్కువ మంది వచ్చి స్థావరం ఏర్పాటు చేసుకొని పట్టలు బాడుగకు ఇచ్చి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ప్లాస్టిక్ సంచులతో తయారుచేసిన పట్టలను ఒక్కోటి రోజుకు రూ.15 నుంచి రూ.20 వరకు బాడుగుకు ఇస్తుంటారు.

చేతి వృత్తినే నమ్ముకొని..

వలస కుటుంబాల్లో పిల్లలను పక్కనబెట్టి ఆడ, మగ తేడా లేకుండా తెల్లవారుజాము నుంచి చీకటి పడే వరకు పనిలో నిమగ్నమవుతున్నారు. సొంత ప్రాంతం నుంచి తయారు చేసుకున్న ప్లాస్టిక్ పట్టలను మాత్రమే ఇక్కడికి తెస్తున్నారు. రహదారి పక్కనే తేలిక పాటి గుడారాలు వేసుకొని అక్కడే వంటలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వీటితో వచ్చే కొద్దో గొప్పో సొమ్ముతో జీవనం కొనసాగిస్తూ, నాలుగు రూకలు కూడగట్టుకొని సొంతూర్లకు వెళ్తారు.

పూట గడవటం కష్టంగా మారింది



వ్యవసాయ పనులకు అవసరమైన ప్లాస్టిక్ పట్టలు బాడుగకు ఇస్తున్నాం. ఎంతో కాలంగా ఈ పనిపై ఆదారపడి పనిచేస్తున్నాం. ప్రతి ఏడాది సీజన్‌లో ఉన్న ప్రాంతం నుంచి బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వచ్చి జీవనం సాగిస్తున్నాం. రోజంతా శ్రమించినా కష్టానికి తగ్గ ఫలితం లభించడం లేదు. చలి కాలం కావడంతో చలి అధికంగా ఉంటుంది. అయినా తప్పని పరిస్థితి. –నాగరాజు, బాపట్ల

వ్యవసాయ పనులే జీవనాధారం



వందల కిలోమీటర్లు వలస వచ్చి జీవనం సాగిస్తున్నాం. పూర్వీకుల నుంచి చేతి వృత్తి పైనే ఆధార పడి కాలం వెళ్లదీస్తున్నాం. వ్యవసాయ పనులున్నప్పుడు ఇక్కడికి వచ్చి ప్లాస్టిక్ సంచులతో తయారు చేసిన పట్టలను ఇక్కడి రైతులకు బాడుగకు ఇస్తున్నాం. రైతులకు ఇచ్చిన పట్టలు సక్రమంగా వస్తే పర్వాలేదు. వాటిలోకూడా ఒక్కోసారి దెబ్బతింటుండటంతో సరిచేసుకోవాల్సి వస్తుంది. రోడ్డుపక్కనే గుడారం వేసుకొని పిల్లా పాపలతో ఉంటున్నాం. – గోపి, అద్దంకి

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



మైనర్లతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బొమ్మలసత్రం: మైనర్లకు వాహనాలు ఇచ్చి బయటకు పంపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా హెచ్చరించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన తనిఖీల అనంతరం సీఐ మాట్లాడుతూ 15 మంది మైనర్లను వాహనాలు నడుపుతుండగా గుర్తించామన్నారు. మైనర్లను స్టేషన్‌కు తీసుకువెళ్లి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకులు అత్యుత్సాహంతో వాహనాలను వేగంగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవటమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలను ముప్పులో పడేస్తున్నారని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వసిస్తున్నట్లు చెప్పారు. బైక్ మీద వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించాలని, మొబైల్ లో మాట్లాడుతూ వాహనాలు నడపటం మంచిది కాదని సూచించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై ప్రజలు వినతులు అందజేయవచ్చని చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

మద్యం మత్తులో గర్భిణిపై దాడి

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో తాగిన మైకంలో ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి నానా బీభత్సం చేస్తుండగా అడ్డు వచ్చిన గర్భిణీ, ఆమె అత్త లక్ష్మీదేవిపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. కొండపేటకు చెందిన సురేంద్ర అదే కాలనీకి చెందిన షేక్షా, భరత్, మధు వద్ద కొంత అప్పు చేశాడు. తిరిగి చెల్లించడంలో జాప్యం చేయడంతో ఆ ముగ్గురు సురేంద్ర ఇంటికి వచ్చి ప్రశ్నించారు. సురేంద్ర లేకపోవడంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్‌ను లాక్కొని అలజడి సృష్టించారు. అడ్డుకున్న భార్య లక్ష్మీదేవి, తల్లిపై దాడి చేశారు. గాయపడిన ఇద్దరిని డోన్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై సురేంద్ర పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు,



వైద్య శిబిరంలో ఉచితంగా మందులు అందజేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపీ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జి.రవిక్రిష్ణ, జిల్లా అధ్యక్షుడు మధుసుదన్‌రావు అన్నారు. నంద్యాల జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చాగలమర్రిలోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు కార్పొరేటు స్థాయి వైద్యాన్ని అందించేందుకు నరాలు, గుండె, ఎముకలు, కీళ్ల, చెవి,ముక్కు, గొంతు, స్త్రీ వ్యాధులు, దంత, గైనకాలజీ, చర్మ వ్యాధి, చిన్న పిల్లల, ఫిజియోథెరపీ తదితర 23 మంది వైద్య నిపుణులతో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా నిర్వహిస్తామని మధుసుదన్‌రావు తెలిపారు. వైద్య సేవలు పొందిన వారికి ఆర్యవైశ్య సంఘం నాయకులు సుంకు జనార్దనరావు, పార్థసారథి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పనిల్ కుమార్, కోశాధికారి సురేంద్రనాథ్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.లక్ష్మణబాబు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి నవత ప్రసాద్, సభ్యులు బచ్చు శ్రీనివాసులు, రవీంద్రకుమార్, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

యువతతోనే నవ సమాజ నిర్మాణం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రీన్‌సొసైటీ సభ్యులు

నంద్యాల (వ్యవసాయం): దేశభవిత యువత చేతిలో ఉందని, సామాజిక స్పృహ,సేవాభావంతో యువత సమాజ పురోగతికి తోడ్పడాలని గ్రీన్ సొసైటీ గౌరవాధ్యక్షులు ఏపీ హోటల్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనిధి కోరారు. ఆదివారం పట్టణంలోని మూలమఠంలోని భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో గ్రీన్ సొసైటీ దశమ వార్షికోత్సవాన్ని అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా రఘువీర్, దండు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పర్యావరణం, సామాజికసేవపై దృష్టి సారించాలన్నారు. నంద్యాల పట్టణం, పరిసర గ్రామాల్లో దశాబ్దకాలంగా విద్యార్థుల్లో నైతికవిలువలు, దేశభక్తిని పెంచే వివిధ పోటీలు నిర్వహిస్తూ పర్యావరణ జాగృతిని పెంపొందిస్తున్నామన్నారు. రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. మిద్దెతోటల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులందజేశారు. నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఉపాధ్యాయసంఘ నేతలు వీరబ్రహ్మం, శేషఫణి, శ్రీనివాసరెడ్డి, గంగులనాగరాజు పోసాశ్రీను, రామసుబ్బారెడ్డి, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆక్రమించారు.. అమ్మేశారు!



రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మించిన దుకాణాలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో కర్నూలు–గుంటూరు రహదారిని ఆక్రమించుకొని యథేచ్ఛగా క్రమ, విక్రయాలు చేస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లాలో కేజీ రోడ్డు 44.400 కిలో మీటరు నుంచి 44.800కిలో మీటరు వరకు ఎడమవైపు రహదారి స్థలాలను కొందరు ఆక్రమించుకొని ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాకుండా దుకాణం ఏర్పాటుకు 20చదరపు అడుగుల స్థలాన్ని రూ.60వేల నుంచి రూ.80వేల వరకు విక్రయించి సొమ్ముచేసుకొంటున్నారు. అయినా అర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కేజీ రోడ్డు కుంచించుకుపోయి వాహనాల డ్రైవర్లు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణకు గురైన కేజీ రోడ్డు స్థలాలను ఖాళీచేయించి వాహనాల రాకపోకలకు, పాదాచారులకు ఇబ్బందుల్లేకుండా చేయాలని వాహనాల డ్రైవర్లు, పాదాచారులు కోరుతున్నారు.

పొలంలో నిప్పు.. తప్పదు ముప్పు!

- పంట వ్యర్థాలను కాల్చితే భూమికి నష్టం
- భూసారాన్ని దెబ్బతీస్తున్న రైతుల ఆలోచనలు
- పొలంలో కలియదున్నితేనే మేలు



వరి కోత అనంతరం చేనుకు నిప్పు పెట్టడంతో కాలిపోతున్న పంట వ్యర్థాలు

బండిఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పండింది. నెల రోజులుగా యంత్రాల ద్వారా కోతలు, నూర్పిడులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదే పొలంలో రబీలో మరో పంట వేసేందుకు పొలాన్ని సిద్ధం చేసేందుకు పంట వ్యర్థాలు అడ్డంకిగా నిలుస్తున్నాయి. పాడి పశువులు ఉన్న రైతులు అయితే వరి గడ్డిని ఇంటికి వివిధ రూపాల్లో రవాణా చేస్తున్నారు. కానీ పాడి లేని రైతులు వరి చేను వ్యర్థాల(గడ్డి)కి పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. రైతులు తీసుకుంటున్న ఈ నిర్ణయం కారణంగా వారికి తెలియకుండానే భూసారాన్ని నాశనం చేస్తున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.


యంత్రాలతో కోతలు జరిగిన పొలాల్లోనే..

మండలపరిధిలో మొత్తం 27 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వరి చేనులో కోతలు కోసిన రైతులు పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. యంత్రాల ద్వారా వరిచేను కోత కోసిన తర్వాత ధాన్యం ఇంటికి చేరకోగా పంట వ్యర్థాలు (గడ్డి) పొలం నిండా పరుచుకుంటుంది. రబీలో పంట వేయాలంటే దుక్కి, దమ్ము చేసేందుకు వ్యర్థాలు(గడ్డి) లేకుండా చేయాలి. ఆ గడ్డిని ఒకచోటకు చేర్చి కుప్ప పెట్టాలంటే రైతులకు ఖర్చుతో కూడిన పని. దీంతో గడ్డికి నిప్పు పెట్టి రబీ పంటను వేసుకుంటున్నారు.

మిత్ర పురుగులకు హాని

రైతులు తీసుకుంటున్న నిర్ణయం కారణంగా రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు అంతరించిపోతున్నాయని వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పొలంలో పరుచుకున్న గడ్డిని కాల్చడం వలన భూమి పైపొరల్లో ఉండే మిత్ర పురుగులు వేడికి నాశనం అవుతున్నాయి. భూమిలో ఉండే వానపాములు, ఇతర శిలీంద్రాలు అంతరించి పోవడం వలన భూమికి నష్టం జరుగుతుందని తెలియజేస్తున్నారు.

మరో పంటకు ఇబ్బంది లేకుండా



వరిచేను యంత్రాలతో కోత కోసిన అనంతరం పొలంలో గడ్డి ఉండిపోతుంది. గడ్డి మట్టిలో కలిసేందుకు ఎక్కువ సమయం పడుతుంది. మరోపంట వేసుకునేందుకు ఇబ్బందిగా ఉన్నందున గడ్డిని కాల్చేస్తున్నాం. తరువాత పొలాన్ని దుక్కి, దమ్ము చేసి రెండో పంట వేసుకుంటున్నాం.

– రాగాల రమణ రైతు, కడమల కాలువ

అవగాహన కల్పిస్తున్నాం

పొలంలో పంటల వ్యర్థాలకు నిప్పు పెట్టడంవలన భూమి పొరల్లో ఉన్న శిలీంద్రాలు ఇతర సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశించి పోతాయి. యంత్రాలతో కోత కోసిన తరువాత వ్యర్థాలను ఒక చోట చేర్చి అవి కుళ్లేలా చేయడం వలన సేంద్రీయ ఎరువు తయారవుతుంది. ఆ ఎరువును పొలానికి వాడుకోవచ్చు. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా ఉండాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– స్వాతి, వ్యవసాయాధికారిణి

దివ్యాంగుల డిమాండ్లను నెరవేర్చాలి

కోవెలకుంట్ల: దివ్యాంగుల డిమాండ్లను నెరవేర్చాలని ఆ సంఘం జిల్లా జేఏసీ నాయకులు నాగరాజు, సుబ్బరాయుడు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోవెలకుంట్ల మండలం వెలగటూరుకు చెందిన దివ్యాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజును ఆదివారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దివ్యాంగులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించి పక్కాగృహాలు కట్టించాలన్నారు. అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన దివ్యాంగులకు త్రీవీలర్ స్కూటీలు, బ్యాటరీ సైకిళ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా దివ్యాంగులకు రూ. 10 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కోలుకోలేక యువతి మృతి

అవుకు: ఆత్మహత్యకు యత్నించిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఎస్ఐ రాజారెడ్డి వివరాల మేరకు.. అవుకు గ్రామానికి చెందిన శిరీష(20) ఏడాది నుంచి టీబీ వ్యాధితో బాధ పడుతోంది. ఎందరి వైద్యుల వద్ద చూపించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 21వ తేదీ నీటిలో పేడరంగు పొడర్‌ను కలుపుకు తాగింది. అవుకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.








కోవెలకుంట్ల-గుంజలపాడు రహదారిలో కురుస్తున్న పొగమంచు, నంద్యాల-ఎర్రగుంట్ల రైల్వేమార్గంలో మంచును చీల్చుకుంటూ వెళ్తున్న రైలు, పంట పొలాలపై మంచు దుప్పటి

మంచు అందాలు

కోవెలకుంట్ల పట్టణాన్ని పొగమంచు కప్పేసింది. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రారంభమైన పొగమంచు దాదాపు రెండు గంటలపాటు కురిసింది. కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, తాడిపత్రికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులను పొగమంచు కప్పేయడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. పంట పొలాలపై దుప్పటి కప్పినట్లు మంచు కురిసింది. మంచుకురిసే వేళ ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎంతో ఆహ్లాదకర వాతావరణం కనిపించింది. పొగమంచు ముందు సూర్యభగవానుడు చిన్నబోయాడు. –కోవెలకుంట్ల



మంచు ముందు చిన్నబోయిన సూర్యుడు